క్లుప్తంగా

ముగిసిన నేవల్ ఎన్‌సీసీ క్యాంప్



సెడార్ పాఠశాల ప్రతినిధులకు షిప్ నమూనాను అందజేస్తున్న ఇంగ్లీశ్వర్

భీమునిపట్నం: సెడార్ పాఠశాలవద్ద నేవల్ ఎన్‌సీసీ కేడెట్‌లకు నిర్వహించిన శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నేవల్ ఎన్‌సీసీ కమాండెంట్ ఇంగ్లీశ్వర్ మాట్లాడుతూ ఇక్కడ పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెడార్ ప్రతినిధి టి.సునీల్, ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, ఎన్‌సీసీ ఏఎన్‌వో పి.ఈశ్వర్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

భీమునిపట్నం: కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని సీఐ లక్ష్మణమూర్తి ప్రారంభించారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, సభ్యులు వి.రాంబాబు, వి.లక్ష్మణరావు, గంధరాము, ఎం.శంకర్, తాతాజీ పాల్గొన్నారు.

నీతి, నిజాయితి అలవర్చుకోవాలి

ఆనందపురం : చిన్నతనం నుంచే నీతి నిజాయితీలను అవవర్చుకుంటే మంచి భవిష్యత్తును పొందవచ్చని రిసోర్స్‌పర్సన్ కె.కాసులమ్మ చెప్పారు. ఆనందపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు నీతి కథలు–నీతి శతకాలు గురించి వివరించారు. అవినీతికి పాల్పడే వారు ఎప్పటికైనా శిక్షకు గురవుతారని చెప్పారు. బొమ్మలతో విజ్ఞానం, వ్యర్థాలతో బొమ్మలు తయారు చేయడం వంటి అంశాలను బోధించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.వి.ఎస్. అప్పారావు పాల్గొన్నారు.

నేరెళ్లవలస కొండపై మళ్లీ తవ్వకాలు



నేరెళ్లవలసలో కొండపై తవ్విన ప్రాంతం

తగరపువలస: నేరెళ్లవలసలో కొండవాలు ప్రాంతంలో శనివారం రాత్రి నుంచి మళ్లీ తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఇటీవల కొండను తవ్వి 200కు పైగా లారీల గ్రావెల్‌ను తరలించారు. దీనిపై ఈనెల 15న 'అక్రమంగా కొండను తవ్వేస్తున్నారు' శీర్షికన 'సాక్షి'లో వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. ఆరురోజుల పాటు ఆగిన తవ్వకందారులు మళ్లీ తవ్వకాలు ప్రారంభించారని స్థానికులు తెలిపారు. తవ్వకాలను వినియోగించిన పొక్లెయిన్,యంత్రాలను రెవెన్యూ అధికారులు సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గోవిందుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు బారులు తీరారు. వేకువ జామున సుప్రభాత, తోమాల సేవ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కోలాటాలు, గోవింద నామ కీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

మైదానం.. అధ్వానం



పూర్తిగా దెబ్బతిన్న క్రీడా సామగ్రి భద్రపరిచే గది



వాకింగ్ ట్రాక్



దెబ్బతిన్న మరుగుదొడ్లు

- గోతులతో నిండిన వుడా గ్రౌండ్
- దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్
- పాడైన మరుగుదొడ్లు
- నిరుపయోగంగా బోర్
- అవస్థలు పడుతున్న క్రీడాకారులు

భీమునిపట్నం: స్థానిక వుడా క్రీడా మైదానం అధ్వానంగా తయారైంది. దీంతో క్రీడాకారులు, వాకర్స్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భీమిలి నుంచి తగరపువలసకు వెళ్లే మార్గంలో విశాలమైన ప్రదేశంలో వుడా 1991 సంవత్సరంలో దీనిని నిర్మించింది. ఇందులో క్రికెట్, ఫుట్‌బాల్‌తో పాటు ఇతర క్రీడలు ఆడేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించారు. వీక్షకుల కోసం గ్యాలరీ, క్రీడా సామగ్రిని భద్రపరచడానికి ఒక గది, మంచినీటి కోసం బోరు ఏర్పాటు చేశారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో ఇదే పెద్ద మైదానం కావడంతో ఇక్కడ తరచూ నియోజకవర్గ, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు, యువకులు, విద్యార్థులకు వేసవి శిక్షణ నిర్వహిస్తుంటారు. రోజూ ఉదయం,సాయంత్రం చాలా మంది వాకింగ్‌కు వస్తుంటారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో ఈ మైదానం అధ్వానంగా తయారైంది. గోతులు, ఎత్తు,పల్లాలు ఏర్పడడంతో క్రీడాకారులు, వాకర్స్ అవస్థలకు గురవుతున్నారు. క్రికెట్, ఫుట్‌బాల్ ఆడే సమయాల్లో క్రీడాకారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. మంచినీటి కోసం వేసిన బోరు నుంచి ఉప్పునీరు వస్తుండడంతో నిరుపయోగంగా మారింది. క్రీడా సామగ్రి భద్రపరచడానికి నిర్మించిన గది దెబ్బతిని పాడైపోయింది. కొంతకాలం క్రితం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి.

దీంతో ఇక్కడ శిక్షణ పొందడానికి, ఆడుకోవడానికి, పోటీల్లో పాల్గొనడానికి వచ్చే వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. వాకర్స్ కోసం అధికారులు 2008లో రూ.రెండు లక్షలతో మైదానం చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. ఆ ట్రాక్‌పై రాళ్లు తేలడంతోపాటు, కొన్ని చోట్ల బాగా దెబ్బతింది. దీంతో వాకర్స్ అవస్థలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు.

ఇబ్బందులు పడుతున్నారు



మైదానం సరిగ్గా లేకపోవడం వల్ల శిక్షణ పొందడానికి వస్తున్న పిల్లలు, యువతీ యువకులు ఇబ్బందులు పడుతున్నారు. క్రీడాకారులకు సౌకర్యంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– పి.రెమో యాదవ్, కరాటే కోచ్

ట్రాక్‌కు మరమ్మతులు చేయాలి



మైదానం చుట్టు ఉన్న వాకింగ్ ట్రాక్ సరిగ్గా లేకపోవడంతో ఇక్కడికి వాకింగ్ చేయడానికి వచ్చేవారు అవస్థలకు గురవుతున్నారు. చాలా చోట్ల రాళ్లు తేలిపోయి ఉండడంతోపాటు గోతులు ఏర్పాడ్డాయి. దీంతో పలువురు ప్రమాదాల బారినపడుతున్నారు. సరైన ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి.
–బోర శ్రీనివాసరెడ్డి, వాకర్

మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం



క్రీడా మైదానంలో ఏ విధమైన సమస్యలు ఉన్నాయో ముందుగా పరిశీలించి, మరమ్మతులకు అంచనాలు రూపొందిస్తాం. ప్రతిపాదనలను జీవీఎంసీకి పంపి జాప్యం జరగకుండా పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.
–బొడ్డేపల్లి రాము, జోనల్ కమిషనర్

ఆకెళ్లకు అర్చక సంఘం నివాళి



నివాళులు అర్పిస్తున్న అర్చక సంఘం ప్రతినిధులు

తగరపువలస: ఇటీవల మరణించిన జగద్గురు ఆదిశంకరాచార్య బ్రాహ్మణ పురోహిత అర్చక సంఘం ప్రథమ అధ్యక్షుడు ఆకెళ్ల నరసింహమూర్తికి శనివారం స్థానిక అర్చకులు నివాళులర్పించారు. బంగ్లామెట్ట శివాలయం ఆవరణలో జరిగిన సంతాపసభలో పలువురు మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘానికి ఆకెళ్ల అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణసంఘం ప్రతినిధులు దార్లపూడి కైలాసం, మేక శంకరశర్మ, మధిర వెంకటరమణమూర్తి, రామాయణం బుజ్జి కామేశ్వరశర్మ, పెంట వెంకటరమణమూర్తి, విస్సు, చిట్టావరుల కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్సీ

మధురవాడ: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని జెడ్సీ కనకమహాలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలో నిర్వహిస్తున్న సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె శనివారం సందర్శించారు. కాలనీ గ్రౌండ్‌లో వాల్తేర్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నారు. శిబిరాన్ని సందర్శించిన జెడ్సీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్ పాల్గొన్నారు.


బి–2 కాలనీకి సిటీబస్సు



సిటీ సర్వీసును ప్రారంభిస్తున్న బొట్ట అప్పలరాజు

పీఎం పాలెం: ఆరోవార్డులోని బి–2 కాలనీవాసులకు సిటీ బస్సు సదుపాయం ఏర్పడింది. తమ కాలనీకి బస్సు సదుపాయం కల్పించాలని ఇటీవల ఆ కాలనీ వాసులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఈ సౌకర్యం కల్పించారు. తాము కోరి నెల రోజులు గడవక ముందే బస్సు రావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. నూతన ఆర్టీసీ సిటీ సర్వీసును వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పరాజు ,మహిళా అధ్యక్షురాలు కె. వరలక్ష్మి,నాయకులు పోతిన ప్రసాద్,నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ లోహిత్,హుసేన్, జామి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేవీకే కిట్ల విషయంలో అప్రమత్తం



జేవీకే స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకుడు వెంకటరావు

పద్మనాభం: జగనన్న విద్యా కానుకలను పాఠశాలలకు చేరవేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని జగనన్న విద్యా కానుకలు–4 జిల్లా పరిశీలకుడు వెంకటరావు అన్నారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలోని జేవీకే మండల స్టాక్ పాయింట్‌ను శనివారం ఆయన పరిశీలించారు . ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ పాఠశాలలకు చేరవేసే లోగా జగనన్న విద్యా కానుకల క్వాలిటీ, సైజులు చూసుకోవాలన్నారు. సమగ్ర శిక్షా జిల్లా ఏపీవో అప్పలనాయుడు మాట్లాడుతూ జగనన్న విద్యా కానుకల పట్ల పీటీఐలు, సీఆర్పీలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం.శివరాణి, ఏఈ సుధాకర్, ఏపీఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

పేదల ద్రోహి చంద్రబాబు



ఆనందపురం జంక్షన్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆనందపురం : రాజధానిలో పేదలకు ఇళ్ల నిర్మిస్తుంటే చంద్రబాబు నాయుడుకు కడుపుమంటగా ఉందని పేదలకు ద్రోహం తలపెట్టే విధంగా ప్రవర్తిస్తున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం ఆధ్వర్యంలో ఆనందపురం జంక్షన్‌లో శనివారం నిరసన వ్యక్తం చేసి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలకు ఏనాడూ మేలు చేయని చంద్రబాబు వారికిచ్చే ఇళ్ల స్థలాలను శ్మశాన గోతులతో పోల్చడం హేయమైన చర్య అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని పేదల బాగుపడాలంటే చంద్రబాబుని, టీడీపీని రాష్ట్రం నుంచి వెళ్లగొట్టాలని పిలుపు నిచ్చారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆనందపురం జంక్షన్ నుంచి వేములవలస వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సీయూసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రంకి అప్పారావు, పార్టీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కోరాడ అప్పలనాయుడు, నాయకులు బొట్టా రామకృష్ణ, కోరాడ ముసలనాయుడు, గంర్రెడ్డి శ్రీనివాస్, పిన్నింటి వెంకట రమణ, కోన శ్రీనివాసరావు, కె.చంద్రమౌళి, చెన్నా సత్యం, చందక అప్పలస్వామి, లెంక రాంబాబు, బంక సూర్యనారాయణ, రౌతు శ్రీను, కోరాడ రాంబాబు, దుమ్మెద అప్పలసూరి, చందక సూరిబాబు, పినిశెట్టి సింహాచలం నాయుడు, గొలగాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అహంకార ధోరణి వీడాలి

తగరపువలస: చంద్రబాబు అహంకార ధోరణి విడనాడాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ భీమిలి మండల నాయకులు శనివారం తాళ్లవలస జాతీయరహదారిపై నిరసన వ్యక్తం చేశారు. మండలపార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు తదితరులు మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఇళ్లపట్టాలు ఇచ్చి కాలనీలను నిర్మిస్తున్నారన్నారు. అమరావతిలో కూడా 50 వేల మంది పేదలకు ఇళ్లు నిర్మించనున్నారన్నారు. దీనిని సహించలేని చంద్రబాబు అప్రజాస్వామికమైన, అహంకారపూరితమైక వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. 2019లో చంద్రబాబుకు బుద్ధి చెప్పిన ప్రజలు 2024లో మరోమారు తరిమికొట్టడం ఖాయమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బోని సన్నిబాబు, వైస్ సర్పంచ్ సింగపూర్ బుజ్జిరాజు, సర్పంచ్ కాద సూర్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, అక్కరమాని అప్పలనాయుడు, దంతులూరి వేణురాజు, బమ్మిడి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ జంక్షన్‌లో

కొమ్మాది: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలను ఖండిస్తూ జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ జంక్షన్ వద్ద గల మహానేత వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు పాల్గొని ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తుంటే చూసి ఓర్వలేని చంద్రబాబు పిచ్చి విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉప్పులూరి గోపి, చెన్నాదాసు, పి.ఆర్‌పి. శ్రీను, దువ్వివాసు, చెన్నాఎల్లయ్య, మాదు చంటి, నొడగల రాంబాబు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బెందాళం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



సాగర్‌నగర్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



తాళ్లవలస జాతీయరహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న భీమిలి వైఎస్సార్‌సీపీ నాయకులు

పద్మనాభంలో

పద్మనాభం: బడుగు, బలహీన వర్గాల ప్రజలను కించపరిచేలా, సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోదంటూ మాజీ సీఎం చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయం నుంచి పద్మనాభం జంక్షన్ వరకు శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జంక్షన్‌లో మానవహారం జరిపారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అముజూరి అప్పారావు, ఈర్ల ఈశ్వరరావు, చందక శ్రీను, చందక పైడినాయుడు, బేపల గురునాయుడు, తాలాడ పద్మనాభం, సుంకర నారాయణరావు, బొలె అప్పలనాయుడు పాల్గొన్నారు.



పద్మనాభంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

వైద్యానికి స్వచ్ఛంద సంస్థల ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ఆనందపురం: ఆపదలో ఉన్న పేదబిడ్డ వైద్యానికి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆర్థిక సాయం చేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం చిన్న కొంగ్రాం గ్రామానికి చెందిన ఢిల్లేశ్వరరావు దంపతులకు ఇటీవల మగబిడ్డ జన్మించాడు. ఆ బిడ్డకు పుట్టికతోనే న్యూరో డిజార్డర్ ఉందని మెరుగైన వైద్యం చేయించుకోవాలని అక్కడ వైద్యులు సూచించడంతో విశాఖలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య ఖర్చులు భారం కావడంతో తన ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ సోషల్ మీడియాలో ఆర్థిక సాయాన్ని అర్థించాడు. ఈ మేరకు మండలంలోని ఆనందపురంలో ఉన్న జై జవాన్ ఫౌండేషన్, బోయిపాలెంలో ఉన్న ఓఎస్‌జీ ఫౌండేషన్ సభ్యులు సాయం అందజేశారు.

విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ప్రారంభం



చిట్టివలసలో విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

తగరపువలస: స్థానిక వేంకటేశ్వరమెట్టపై అలివేలు మంగ, పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయం, ఉపాలయాల్లో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. విష్వక్సేనుడు, గరుడాళ్వార్, వకుళమాత, వరదరాజుస్వామి, యోగ నరసింహస్వామి, బేడీ ఆంజనేయస్వామి విగ్రహాలను చిట్టివలస, తగరపువలస వీధుల్లో ఊరేగించారు.

సాయంత్రం ఆలయ ఆవరణలోని యాగశాలలో రుత్వికులు రేజేటి శ్రీరామాచార్యులు, సీతారామాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, రక్షా సూత్రధారణ, దీక్షాధారణ, మత్సంగ్రహణం, అంకురార్పణ, హోమం, జలాధివాసం, నీరాజన మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాల సందర్భంగా వేంకటేశ్వరమెట్టపై ఆలయాలు, మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వంశపారంపర్య ధర్మకర్త కుసుమహర కోరారు.

రోడ్డును తవ్వి.. వదిలేశారు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు రిక్షా కాలనీలో కాల్వ నిర్మాణం కోసం బీటీ రోడ్డును తవ్వేడమే కాకుండా, వ్యర్థాలను ఇష్టానుసారంగా వదిలేశారనికాలనీ అధ్యక్ష, కార్యదర్శులు జోగారావు, నాగేశ్వరరావులు జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ కాలనీలో గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న 30 అడుగుల రోడ్డులో 10 అడుగుల మేర కాల్వ నిర్మాణం కోసం జీవీఎంసీ అధికారులు తవ్వేసి వదిలేశారన్నారు. కాల్వ నిర్మాణం పూర్తయిన తర్వాత రోడ్డు నిర్మించకపోవడంతో అవస్థలకు గురవుతున్నామని చెప్పారు. వ్యర్థాలు కూడా పార్కు స్థలంలో ఇష్టానుసారంగా పడేసి 20 రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని వాపో యారు. ఏఈకి ఫిర్యాదుచేస్తే వ్యర్థాలు తొలగిస్తామనిచెప్పి రోజులు గడుస్తున్నా ప్రయోజనంలేకపోయిందన్నారు. రోడ్డునిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.

రాణించిన యశ్వంత్, చంటి

విశాఖ స్పోర్ట్స్ : వీడీసీఏ డివిజన్ లీగ్‌లో భాగంగా మూడో డివిజన్‌లో జరిగిన పోటీల్లో యశ్వంత్, చంటి రాణించి జట్టుకు విజయాన్నందించారు. వైఎస్ఆర్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో సోలో సీసీతో తలపడిన సిటీసీసీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 264 పరుగులకు ఆలౌటైంది. యశ్వంత్ (107)సెంచరీ నమోదు చేయగా వరుణ్ 77 పరుగులు చేశాడు. ప్రతిగా సోలోసీసీ 185 పరుగులకే ఆలౌటైంది. చంటి 44 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీశాడు.

మృతుని కుటుంబానికి బీమా సొమ్ము అందజేత

పీఎం పాలెం: శంభువానిపాలెం రోడ్డులోని తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు పడి మరణించిన షేక్ చిన సయ్యద్ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు నగదును వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం అందజేశారు. ఆరో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, వార్డు జనరల్ సెక్రటరీ పోతిన ప్రసాదు,లోహిత్, స్థానిక నాయకులు హుస్సేన్,అల్తఫ్,జామి శివ , సంజయ్ యాదవ్,మసీద్ ప్రెసిడెంట్ ఎం.కె.ఎం. సిస్టి ఉస్మానియా నగదు అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చనిపోయిన కృష్ణంరాజు

భీమునిపట్నం: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. ఇక్కడ సమీపంలోని బ్యాంక్ కాలనీకి చెందిన కృష్ణంరాజు(30) టిఫిన్ షాపును నిర్వహిస్తున్నాడు. ఇతను శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో ఇంటివద్దనున్న తన తల్లి విద్యాధరణి మంగతాయారు వద్దకు వెళ్లి తాను పురుగుల మందు తాగినట్టు చెప్పి పడిపోయాడు. వెంటనే అతన్ని ఇక్కడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లి అక్కడ ప్రథమ చికిత్స అందించి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కాగా తన కొడుకు షాపు నిర్వహణ కోసం అప్పులు చేసి నష్టపోయాడని అందుకే ఆత్మహత్యకు పాల్పడినట్టు విద్యాధరణి పోలీసులకు తెలిపింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు, పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు అదృశ్యం




సాయి కొండ (ఫైల్)

పీఎం పాలెం: సాగర్‌నగర్ గుడ్లవానిపాలెంలో నివసిస్తున్న పి.సాయికొండ(30) అదృశ్యమయ్యాడు. ఈ మేరకు పీఎం పాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.సాయికొండ(30) భార్యాపిల్లలతో కలిసి సాగర్‌నగర్ గుడ్లవానిపాలెంలో నివసిస్తున్నాడు. అతను క్రెడిట్ కార్డుల ద్వారా ఎక్కువగా నగదు వాడాడు. ఆ సొమ్ము చెల్లించలేక 3 నెలల కిందట ఇంటినుంచి వెళ్లి పోయాడు. మధురవాడ కొమ్మదిలో నివసిస్తున్న, స్థానిక దివ్యాంగుల కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న తన తల్లి పావని వద్దకు ఈ నెల 1 వ తేదీన వచ్చాడు.క్రెడిట్ కార్డుల విషయం తెలియజేశాడు. ఏదో ఒకటి చేద్దామని కొడుకు సాయికొండను ఆమె సముదాయించింది.అయితే అదే రోజు మళ్లీ ఎటో వెళ్లిపోయి తిరిగి రాలేదు. గాలించినా జాడ తెలియకపోవడంతో పావని పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పూర్తిస్థాయి వినియోగంలోకి ఆర్వోప్లాంట్

సాక్షి ఎఫెక్ట్..



సంగివలస కాలనీలో ఆర్వో ప్లాంట్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంగివలస కాలనీలో ఆర్వో ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చారు. దివీస్ లేబరేటరీ ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ నిర్వహణ సరిగ్గా లేక తెరవకపోవడంతో ఈ నెల 16న 'ఆర్వో ప్లాంట్ నిర్వహణ గాలికి' శీర్షికతో వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో దివీస్ సామాజికసేవా అధికారులు జోక్యంతో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి,ఆర్వోప్లాంట్ ఆపరేటర్ మాడెంస్వాతిని అందుబాటులో ఉంచారు.

ప్రాతఃస్మరణీయులకు నివాళి

తగరపువలస: భీమిలి ఆదర్శప్రేమీ మండలి ఆధ్వర్యంలో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు బిపిన్ చంద్రపాల్, దివంగత ముఖ్యమంత్రులు టంగుటూరి ప్రకాశం పంతులు, కాసు బ్రహ్మానందరెడ్డిలకు నివాళులు అర్పించారు. భీమిలిలో జరిగిన కార్యక్రమంలో వీరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీరు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్. కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.